సాక్షి
అనంతపురం
శనివారం । 22 । మార్చి । 2025



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి ధర రూ.7 ప్రకారం క్రయవిక్రయాలు సాగాయి.



న్యూస్‌రీల్

దాహం కేకలు



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న జెడ్ వీరారెడ్డి కాలనీ మహిళలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని జెడ్ వీరారెడ్డి కాలనీ మహిళలు తాగునీటి కోసం శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. కాలనీలో 250 నివాసాలు, దాదాపు వెయ్యిమంది జనాభా ఉన్నారు. ఇక్కడ 20 రోజులకు లేదా 25 రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు సరఫరా చేస్తారు. ఒక రోజు పట్టుకున్న నీటిని రెండు మూడు రోజుల వరకు నిల్వ చేసుకుని తాగగలరు.. మిగతా రోజుల పరిస్థితి ఏమిటి..? సమస్య పరిష్కరించకుండా ఇలాగే తాత్సారం చేస్తే మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉరుములు, మెరుపుల వాతావరణం

అనంతపురం అగ్రికల్చర్: రాగల మూడు రోజుల్లో వాతావరణంలో మార్పులు ఉంటాయని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 40.3 డిగ్రీల నుంచి 41 డిగ్రీలు, కనిష్టం 25 డిగ్రీల నుంచి 25.6 డిగ్రీల మధ్య నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 45 నుంచి 65, మధ్యాహ్నం 22 నుంచి 25 మధ్య రికార్డు కావచ్చని తెలిపారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 9 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో మొక్కలు గాలికి పడిపోకుండా ఉద్యాన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, జీవాలను బయట ప్రాంతంలో కాకుండా షెడ్లలో ఉంచాలని సూచించారు.

రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో (2025–26 విద్యాసంవత్సరం) ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఆర్‌జేసీ, డీసీ విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్, కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ జలజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు www.aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఏపీఆర్ జేసీ, ఏపీఆర్ డీసీ సెట్‌కు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి, అదేరోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి పరీక్ష ఉంటుందని వివరించారు. అలాగే 38 సాధారణ పాఠశాలలు, 12 మైనార్టీ గురుకుల పాఠశాలల్లోనూ 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో పాటు 6, 7, 8 తరగతుల్లో మిగులు సీట్ల కోసం 'ఏపీఆర్ఎస్ క్యాట్ 2025'కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం 2024–25 ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా పడిపోయింది. భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడంతో పాటు కూటమి పార్టీల నేతల భూ ఆక్రమణలు, బెదిరింపుల నేపథ్యంలో స్థిరాస్తుల క్రయ విక్రయాలు మందగించాయని తెలుస్తోంది.

రియల్... ఢమాల్



- కూటమి పాలనలో స్థిరాస్తి రంగం కుదేలు
- తొమ్మిది నెలల్లో ఒక్క వెంచర్ కూడా ఏర్పాటు కాలేదు
- కొత్త అపార్ట్‌మెంట్లు లేవు.. పాతవి అమ్ముడుపోలేదు
- భూముల విలువ పెంపు.. సర్కారు చార్జీల బాదుడు
- జిల్లాలో భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాకు ఒక ప్రత్యేకత ఉంది. బాగా అభివృద్ధి చెందిన రెండు మహానగరాలకు మధ్యలో ఉండటం ఒకెత్తయితే.. జాతీయ రహదారి అనంతపురం మీదుగా వెళుతుంది కాబట్టి స్థిరాస్తి రంగం అంచలంచెలుగా ఎదుగుతూ ఉండేది. బెంగళూరుకు చేరుకోవాలంటే రెండు గంటల్లో వెళ్లే పరిస్థితి. హైదరాబాద్‌కు కూడా నాలుగైదు గంటల్లో వెళ్లే అవకాశం ఉంది. మంచి రోడ్డు సౌకర్యంతోపాటు బెంగళూరు అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌కు రెండు గంటల్లో వెళ్లే అవకాశం ఉండటం వల్ల అనంతపురం అభివృద్ధి బాగా ఉండేది. కానీ ఇది గత చరిత్ర. కూటమి సర్కారు వచ్చాక స్థిరాస్తి రంగం కుదేలైంది. నిత్యం దందాలు, భూ ఆక్రమణలు, గొడవలు లాంటి పరిస్థితుల ప్రభావం సామాన్యులు, మధ్యతరగతి వారిపై తీవ్రంగా పడింది.

ఒక్క వెంచర్ వచ్చి ఉంటే ఒట్టు

అనంతపురం – బెంగళూరు జాతీయ రహదారి వెంట రియల్ ఎస్టేట్ బాగా ఉండేది. కానీ సర్కారు నిర్ణయాలు, పరిస్థితుల కారణంగా గడిచిన 9 నెలల్లో ఒక్క కొత్త వెంచర్ కూడా రాలేదు. భూములు కొని ప్లాట్‌లు వేద్దామన్న ఇన్వెస్టర్లే లేరు. అంతెందుకూ గతంలో వెంచర్లు వేసి కట్టిన ఇళ్ల కొనుగోళ్లు కూడా నిలిచిపోయాయి. అనంతపురం నగర పరిధిలో ఏటా అపార్ట్‌మెంట్లలో వెయ్యి ఫ్లాట్ల వరకు అమ్మకాలు జరిగేవి. కానీ గడిచిన తొమ్మిది నెలల్లో 200 ఫ్లాట్లు కూడా అమ్ముడుపోలేదు. తాడిపత్రి ప్రాంతంలోనూ స్థిరాస్తి క్రయవిక్రయాలు మరింత దిగజారినట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం పతనం

జిల్లాలో మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో అనంతపురం అర్బన్, రూరల్ కార్యాలయాల్లో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. అలాంటిది ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా పడిపోయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఆర్థిక సంవత్సరం పదిరోజుల్లో ముగుస్తున్నా ఇప్పటివరకూ 69 శాతానికి కూడా మించలేదు. గుంతకల్లు, ఉరవకొండ, యాడికి, కణేకల్లు వంటి ప్రాంతాల్లోనూ రిజిస్ట్రేషన్ల ఆదాయం పూర్తిగా పడిపోయింది. దీనికితోడు ఇటీవల భూముల విలువ పెంచడంతో రిజిస్ట్రేషన్ల చార్జీలు భారీగా పెరిగాయి. ఇవన్నీ పక్కన పెడితే వెంచర్లు లేదా బిల్డింగ్ యజమానులను కూటమి నేతలు బెదిరిస్తుండటంతో ఎవరూ ముందుకు రావడం లేదు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో లావాదేవీలు (రూ.కోట్లలో)

రిజిస్ట్రేషన్ కార్యాలయం	లక్ష్యం	సాధించినది
గుత్తి	21.70	12.38
గుంతకల్లు	33.65	18.19
కళ్యాణదుర్గం	23.60	15.02
కణేకల్లు	11.51	07.12
పామిడి	16.00	07.16
రాయదుర్గం	24.10	15.15
శింగనమల	13.31	07.05
తాడిపత్రి	58.00	25.25
ఉరవకొండ	15.95	10.10
యాడికి	07.73	03.84
అనంతపురం అర్బన్	158.85	87.79
అనంతపురం రూరల్	85.84	52.95

చిన్న బల్లలపై పరీక్షలు ఎలా రాస్తారు?

- విద్యాశాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంత చిన్న బల్లలపై పదో తరగతి విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారు.. చీఫ్ సూపరింటెండెంట్ ఏమి చేస్తున్నారు.. చూసుకోకపోతే ఎలా.. పరీక్షల నిర్వహణలో ఇంత అలసత్వంగా ఉంటే ఎలా? అంటూ కలెక్టర్ వినోద్‌కుమార్ విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. నగరంలోని గుడ్ చిల్డ్రన్ స్కూల్ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్న పిల్లలు కూర్చునే బల్లలపై పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తుండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఏర్పాటు చేసిన బల్లలు (డెస్కులు) చాలా చిన్నవిగా ఉన్నాయని, వాటిని మార్చాలని ఆదేశించారు. వెలుతురు సరిగా లేని రూములలో లైట్లు వేయాలని, పరీక్షలు నిర్వహించే ముందు విద్యాశాఖ అధికారులు ప్రతి పరీక్ష కేంద్రాలలోని వసతులను పరిశీలించాలి కదా? అని మండిపడ్డారు. కలెక్టర్ వెంట డీఈఓ ప్రసాద్ బాబు ఉన్నారు. ఇదిలా ఉండగా ఇంగ్లిష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 31,009 మందికి గాను 30,213 మంది హాజరయ్యారు. జిల్లాస్థాయి పరిశీలకులు ఆరు కేంద్రాలు, జిల్లా విద్యాశాఖ అధికారి ఒక కేంద్రాన్ని, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఒక కేంద్రం, ఫ్లయింగ్ స్క్వాడ్ 37 కేంద్రాలను పరిశీలించారు.

నేత్రపర్వం.. శ్రీవారి అలుకోత్సవం

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి అలుకోత్సవం భక్తి శ్రద్ధలతో నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామివారు అశ్వవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు అర్చకులు యాగశాలలో నిత్యహోమం నిర్వహించారు. అనంతరం శ్రీవారికి విశేషాలంకరణ చేసి ఆలయానికి సమీపంలో ఉన్న సుద్దుల మండపం వద్దకు తీసుకువచ్చారు. ఆనవాయితీ ప్రకారం అలుకోత్సవం ఉభయదారులుగా వ్యవహరించిన ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చక పండితులు బ్రహ్మోత్సవాలు, అలుకోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అలుకోత్సవంలో శ్రీదేవి,భూదేవి సమేత నృసింహుడు

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు



అనంతపురం: పోక్సో కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం స్పెషల్ సెషన్స్ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం ఎనుమలవారిపల్లికి చెందిన కుళ్లాయప్ప కుమారుడు వీరానిపల్లి చిరంజీవి (22) ఓ బాలికను ఇంటి వద్ద వదిలి పెడతానని తన ఆటోలో తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కదిరి పోలీస్ స్టేషన్‌లో 2019 మార్చి 22న కేసు నమోదు చేశారు. నిందితుడిని అదే రోజు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ బి.వెంకటచలపతి కేసు దర్యాప్తు చేశారు. అనంతరం సీఐ టి.మధు జిల్లా సెషన్స్ కోర్టులో నిందితుడు వీరానిపల్లి చిరంజీవి అలియాస్ చిరుపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ కేసును అనంతపురం ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు. గురువారం ఈ కేసును ట్రయిల్ చేసి మొత్తం 14 మంది సాక్షులను విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వీరానపల్లి చిరంజీవి అలియాస్ చిరుకు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రత్యేక న్యాయ స్థానం (పోక్సో కోర్టు) శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ, విద్యాపతి వాదించారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి చిన్నారి మృతి



మృతి చెందిన అనుశ్రీ

రాయదుర్గంటౌన్: ఆర్ఎంపీ వైద్యం వికటించి చిన్నారి మృత్యువాత పడింది. వివరాలిలా ఉన్నాయి. గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, లక్ష్మీ దంపతుల కుమార్తె అనుశ్రీ (4) రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. గురువారం నుంచి రాయదుర్గంలోని మూస క్లినిక్‌లో ఆర్ఎంపీతో చూపించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో శుక్రవారం సాయంత్రం మరోమారు క్లినిక్‌కు తీసుకొచ్చారు. ఆర్ఎంపీ హఫీజ్ రక్త పరీక్షలు చేయించి.. టైఫాయిడ్ ఉన్నట్లు నిర్ధారించాడు. అనంతరం అక్కడే సెలైన్ బాటిల్ ఎక్కించాడు. అయితే కొద్దిసేపటికే చిన్నారిలో తేడా కనిపించడంతో ఆందోళనకు గురైన ఆర్ఎంపీ.. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే అనుశ్రీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో బంధువులు మృతదేహాన్ని తీసుకుని క్లినిక్ వద్దకు వచ్చి ఆర్ఎంపీని నిలదీసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీపీఎం, విద్యార్థి సంఘం, ఎంఆర్‌పీఎస్ నాయకులు అక్కడికి చేరుకుని బాధితులకు మద్దతుగా నిలిచి, ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ జయానాయక్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

ఇళ్ల కూల్చివేతలో గూడుపుఠాణి

- అన్ని రాజకీయ పార్టీలూ స్పందించాలి
- బాధితులకు అండగా నిలవాలి
- రిటైర్డు జడ్జి కిష్టప్ప



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి కిష్టప్ప

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట సర్వే నంబరు 106–1 పరిధిలోని విద్యారణ్యనగర్‌లో ఇళ్ల కూల్చివేత వెనుక ఏదో గూడుపుఠాణి జరిగిందని విశ్రాంత జిల్లా జడ్జి కిష్టప్ప ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ఇళ్లను కూల్చాలని, పోలీసు ప్రొటెక్షన్ తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వనే లేదన్నారు. జాయింట్ కలెక్టర్ కూడా ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేదన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టు కూడా ఎక్కడా ఇళ్లను తొలగించాలని కానీ, పోలీసులను పిలుచుకెళ్లండని కానీ చెప్పలేదని వివరించారు. ఇంత పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఎవరు చేయమన్నారు? వీరి వెనుక ఉన్న ఆ పెద్ద శక్తి ఎవరు? అని కిష్టప్ప ప్రశ్నించారు. ఇళ్లను కూల్చడానికి డీఎస్పీ, ఆర్డీఓ, తహసీల్దార్‌లే ధైర్యం చేయలేరన్నారు. ఇళ్లను కూల్చే విషయానికి సంబంధించి సుప్రీం కోర్టు ఓ కేసులో 95 పేజీల తీర్పు ఇచ్చిందన్నారు. ఆ ప్రకారం చాలా పెద్ద ప్రొసీజర్ ఉందన్నారు. ప్రొసీజర్ ఇక్కడ అటువంటిదేదీ ఫాలో కాలేదన్నారు. వాస్తవానికి కోర్టు ఉత్తర్వుల్లో మునిసిపాలిటీ పరిధిలోని సర్వే నంబరులో స్థలాన్ని స్వాధీనం చేయాలని స్పష్టంగా ఉందని తెలిపారు. కానీ వీరు మాత్రం నారాయణపురం పంచాయతీ పరిధిలోని భూమిని స్వాధీనం చేస్తున్నారని చెప్పారు. దీని వెనుక ఉన్న కుట్ర బయటకు రావాలన్నారు. ప్రజలంతా ఏకం కావాలన్నారు. ఘటనపై అన్ని రాజకీయ పార్టీలూ స్పందించాలన్నారు. బాధితులకు అండగా ఉండాలని కోరారు.

నేడు ఉరవకొండలో జిల్లాస్థాయి జలదినోత్సవం

అనంతపురం అర్బన్: ఉరవకొండలో శనివారం జిల్లాస్థాయి జలదినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. జలదినోత్సవం, పల్లె పండుగ కార్యక్రమంపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జలదినోత్సవం కింద ప్రతి గ్రామపంచాయతీలోనూ ఫారంపాండ్ల పనులు ప్రారంభించాలన్నారు.

శ్రీవారి సొమ్ముకు భద్రతేదీ?

- పెన్నోబులేసుని ఆదాయానికే కన్నం
- సంచలనం రేకెత్తిస్తున్న 'బంగారు మూట' మాయం
- టీడీపీ నాయకుల అండదండలతోనే అక్రమాలు
- గతంలో సస్పెండైన అధికారికే ఆలయ ఈఓగా పోస్టింగ్
- స్వామి వారి రథం విరాళాల సేకరణలోనూ భారీ గోల్‌మాల్



పెన్నహోబిలంలో విచారణ చేస్తున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా



భక్తురాలు హుండీలోకి వేసిన బంగారు, వెండి ఆభరణాలు

ఉరవకొండ: స్వామి సేవలో తరించాల్సిన దేవదాయ శాఖ సిబ్బంది దారితప్పారు. భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలపై కన్నేశారు. రికార్డుల్లో పొందుపరచకుండా సొమ్ములు మాయం చేస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆదాయానికే కన్నం వేస్తున్నారు. నిఘా కోసం అమర్చిన సీసీ కెమెరాల్లో కొన్నింటిని పనిచేయకుండా చేసి తమ పని ఎంచక్కా కానిచ్చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శిస్తుంటారు. శ్రీవారిని దర్శించుకుని హుండీ ద్వారా కానుకలు సమర్పిస్తుంటారు. ఇలాంటి కానుకల్లో కొన్ని స్వాహా అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆలయ పాలనా వ్యవహారాల్లో టీడీపీ నేతల జోక్యం పెరిగింది. ఈ క్రమంలోనే అవినీతి, అక్రమాలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఇందుకు తాజాగా వెలుగు చూసిన భక్తులు స్వామివారికి సమర్పించిన 'బంగారు–వెండి నగల మూట' మాయం ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఘటనలో దేవదాయ శాఖ ఉన్నతాధికారితో పాటు స్థానిక అధికారి పాత్ర ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 18న ఆలయంలో జరిగిన స్వామి వారి హుండీ కానుకల లెక్కింపులో ఆకస్మాత్తుగా ఏసీ ఆదిశేషనాయుడు ప్రత్యక్షమవడం చర్చనీయాంశమైంది. హుండీ కానుకల లెక్కింపు గురించి పత్రికా ప్రకటనలు ఇవ్వకుండానే అధికారులు గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మాయమైన నగల మూట తిరిగి హుండీలోకి చేర్చడం.. మళ్లీ అందులో కొన్ని బంగారు నగలు కనిపించకుండా పోవడం చర్చనీయాంశంగా మారింది.

అవినీతి మరకలున్నా.. అందలం

పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో కార్యనిర్వాహక అధికారి (ఈఓ)గా సాకే రమేష్‌బాబు గతంలో పని చేశారు. ఆలయం సొమ్ము దుర్వినియోగం, రికార్డులు అస్తవ్యస్తం, కీలక ఫైళ్లు మాయం సహా 32 అభియోగాలు రావడంతో రమేష్‌బాబును 2021లో తిరుపతి ఆర్‌జేసీ సస్పెండ్ చేశారు. అలాంటి అధికారి కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నేతల ఆశీస్సులతో తిరిగి పెన్నహోబిలం ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పునరాగమనం చర్చనీయాంశంగా మారింది. ఆలయంలో భద్రత– నిఘా కోసం 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే ఇందులో ఏడు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలినవి రిపేరీ చేయాల్సి ఉందని సిబ్బంది చెబుతున్నారు.

రథం పేరిట మళ్లీ విరాళాలు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో 43 అడుగుల నూతన రథం తయారీకి సంబంధించి రివర్స్‌టెండరింగ్ విధానంలో రూ.2.30 కోట్లతో కాంట్రాక్టర్ గౌతంరెడ్డి పనులు దక్కించుకున్నారు. భక్తుల విరాళాలు, దేవదాయ శాఖ నిధులతో రథం తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలువురు టీడీపీ నేతల సూచనలతో ఆలయ ఈఓ రథం నిర్మాణానికి మళ్లీ విరాళాలు సేకరణ మొదలు పెట్టారు. విరాళాలు అందించే దాతల్లో 80 శాతం మందికి రశీదులు కూడా ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. విరాళాల్లో భారీగా గోల్‌మాల్ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

సమగ్ర విచారణ చేపడతాం

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి వారికి మొక్కులో భాగంగా సమర్పించిన 'బంగారం' మాయం చేయాలని చూసిన ఘటనపై సమగ్ర విచారణ చేపడతాం. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ఈ వ్యవహారంలో తప్పు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్ ఆజాద్, ఆర్‌జేసీ, తిరుపతి

దాతలిచ్చే బియ్యమూ పక్కదారి

పెన్నహోబిలంలో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. అయితే చాలామంది దాతలు సోనామసూరి బియ్యం ప్యాకెట్లు, బ్యాగ్లు, ఇతర వస్తువులు వితరణ చేస్తున్నారు. ఆలయ సిబ్బంది సోనామసూరి బియ్యం పక్కదారి పట్టించి, సాధారణ బియ్యంతో వంట వండుతున్నారు.

'బంగారు మాయం'పై విచారణ

భక్తురాలు వేసిన బంగారు ఆభరణాల మూట మాయం ఘటనకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ మహబూబ్‌బాషా శుక్రవారం పెన్నహోబిలం ఆలయంలో విచారణ చేపట్టారు. ఈఓ రమేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్లు, మారుతి, దీపక్‌తో వివరాలు ఆరా తీశారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

• ప్రధాన సమస్యలపై నిలదీయనున్న సభ్యులు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం జరగనున్నాయి. స్థాయీ సంఘం-1, 2, 4, 7 (ఆర్థిక, ప్రణాళిక/ గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్యం/ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ శాఖల) సమావేశాలు ప్రధాన సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారు. స్థాయీ సంఘం-3, 5, 6 (వ్యవసాయం/ ఐసీడీఎస్/ సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జెడ్పీ అదనపు భవన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు. సమావేశాలకు సంబంధించి సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులకు ఇది వరకే సమాచారం అందించారు. అయితే ఈసారి జరిగే సమావేశాలు వాడీవేడిగా జరగనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. అనంతపురం అర్బన్ ప్రాజెక్టులో ఓ అంగన్‌వాడీ టీచర్ విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న విషయం ఆధారాలతో సహా తేలినా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. సామాజిక భద్రత పింఛన్లలో కోతలు, రేషన్ సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయకపోవడం తదితర సమస్యలు ఉన్నాయి. గృహనిర్మాణ శాఖలో ఉద్యోగుల పనితీరు, అవినీతి ఆరోపణలు ఉన్నాయి. తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ సమస్యలన్నింటిపై సభ్యులు గళం విప్పనున్నారు. వాడీవేడీగా జరిగే అవకాశం ఉందని ముందే పసిగట్టిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిసింది.

13 మంది విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఎల్ఎల్‌బీ మొదటి, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 13 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

‘హరి-హర’ క్షేత్రానికి అడుగులు

• భారీ ఆలయ నిర్మాణానికి రూపకల్పన చేసిన సనాతన ధర్మపరిరక్షణ వేదిక • రూ.1,200 కోట్ల వ్యయంతో బృహత్ క్షేత్ర నిర్మాణం • సమావేశంలో వెల్లడించిన స్తపతులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి


300 అడుగుల ఎత్తుతో నిర్మించనున్న కోటిలింగాల ఆలయం నమూనా


108 అడుగుల విశ్వరూప సందర్శనంతో నిర్మించనున్న ఆలయ నమూనా

అనంతపురం కల్చరల్: ప్రపంచంలోనే ఎత్తైన 216 అడుగుల రామానుజల విగ్రహం, ఓంకారేశ్వరంలోని 108 అడుగుల ఆదిశంకర భగవత్పాదుల విగ్రహం, తెలంగాణాలో సుప్రసిద్ధి చెందిన యాదాద్రి గుట్టపై ఉన్న స్వర్ణగిరి మందిరాన్ని మించిన మరో అరుదైన ఆలయానికి ‘అనంత’ వేదికగా మారనుంది. సనాతన ధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్మాణమయ్యే అపురూపమైన ఈ కట్టడ నమూనాలను అనంత ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు శుక్రవారం అనంతపురంలోని గీతామందిరంలో ధర్మప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణు, ఇస్కాన్ ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు నేతృత్వంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రసిద్ధ ఆలయాలు, కట్టడాలను నిర్మించిన ప్రముఖ శిల్పులు డీఎస్‌వీ ప్రసాద్ స్తపతి, రాజమండ్రికి చెందిన శ్రీనివాస స్తపతి, తిరుమల గోవింద పీఠం పీఠాధిపతి శ్రీరామప్రియ యతీంద్ర స్వామీజీ తదితరులు మాట్లాడారు. వైదిక ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మరోసారి ఆధ్యాత్మికంగా స్వర్ణయుగం రానున్న నేపథ్యంలో చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ధార్మిక మండళ్ల ప్రతినిధులు పరాంకుశం కృష్ణశర్మ, ఆచార్య మనోరంజనరెడ్డి, చిదంబరం, శ్రీధర్, చంద్రశేఖర్, రంగారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కోటి మంది హిందువులను భాగస్వాములను చేస్తూ దాదాపు రూ.1,200 కోట్ల వ్యయంతో అనంత వేదికగా బృహత్ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని నాయనిపల్లి క్రాస్ వద్ద ప్రాచీన విశేషాలతో కూడిన ‘హరి-హర క్షేత్రం’ నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రపంచంలోనే ఎత్తైన 300 అడుగుల కోటి లింగాల అపురూప మహాశివలింగం, దాని కిందనే దివ్య స్ఫటిక శ్రీచక్ర మేరువు, చుట్టూ అష్టాదశ శక్తిపీఠాల ఆలయాల ప్రతిష్టాపన జరుగుతాయన్నారు. దీనికి పక్కనే 108 అడుగుల శ్రీమన్నారాయణ విశ్వరూప దర్శన కాంస్య విగ్రహంతో పాటు, అదే పీఠంపై దశావతారాల విగ్రహాలు నిర్మిస్తున్నట్లుగా తెలిపారు. వీటికి ఎదురుగా 54 అడుగుల ఎత్తుతో నంది, గరుడ విగ్రహాలు, సప్తాశ్వ రథారూఢుడైన సూర్యదేవ విగ్రహం, త్రిమతాచార్యులైన ఆది శంకరులు, మధ్వాచార్యులు, రామానుజాచార్యుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. అన్నింటి కంటే ప్రధానంగా ఈ విశాలమైన ప్రదేశంలో వైదిక ధర్మాన్ని నేర్పే సంస్కృత పాఠశాల, వేద విజ్ఞానాన్ని అందించే పుస్తక భాండాగారం, రిషి విజ్ఞాన డిజిటల్ లైబ్రరీ, ప్రాచీన ఆయుర్వేదాలయం, రామాయణ, భగవద్గీతల విశిష్టతలను తెలియజేసే కళాఖండాలూ నిర్మిస్తామన్నారు.

దేశ విదేశాలలో స్థిరపడిన హిందువులు వచ్చి దర్శించుకునేందుకు వీలుగా పర్యాటకంగా ఈ ఆలయ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ప్రత్యేక కమిటీగా ఏర్పడిన ధర్మ పరిరక్షణ వేదిక సభ్యులు వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం ఈ అపురూప కట్టడం గోదావరి తీరంలో కట్టాలని సంకల్పించినా ఇక్కడి ఆధ్యాత్మికవేత్తల చొరవతో అనంతకు మార్చారన్నారు. ఈ ఏడాది ఆగస్టులో భూమి పూజ ఉంటుందని, అప్పటి నుంచి ఐదేళ్లలోపు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

23న రౌండ్‌టేబుల్ సమావేశం



వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈ నెల 23న నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు జీవనాడిగా ఉన్న హంద్రీ-నీవా, హెచ్చెల్సీ ప్రాజెక్టులపై చర్చించి, చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ప్రకటించిన అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని కోరుతూ వెనకబడిన ప్రాంతాల అభివృద్ధిని ఆకాంక్షించే ఔత్సాహికులు, మేధావులు ఈ నెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు బీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో శ్రీనివాసులు, గంటల నారాయణ రెడ్డి, కుళ్లాయప్ప, వెంకటేశులు, పృథ్వీ, నరేంద్ర పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కార్మికుల హక్కు

• ఎంప్లాయిస్ సంఘ్ డిమాండ్


ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు: కార్మికుల హక్కుగా ఉన్న పాత పెన్షన్ విధానాన్ని సాధించుకుని తీరుతామంటూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ అన్నారు. డిమాండ్ సాధనలో భాగంగా శుక్రవారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఇప్పటికే పలు మార్లు ఆందోళనలు చేసినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చే వరకూ ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు మల్లికార్జున, బాలకృష్ణ, ప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల అధికారుల నియామకం

• ఉత్తర్వులు జారీ చేసిన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో ఐదు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులను నియమించారు. ఈ మేరకు ఉభయ జిల్లాల ఎన్నికల అధికారులు డాక్టర్ వి.వినోద్‌కుమార్, టీఎస్ చేతన్ ఉత్తర్వులు జారీ చేశారు. కణేకల్లు మండలానికి జిల్లా రిజిస్ట్రార్ జి.భార్గవ్, కంబదూరు మండలానికి ఆత్మ పీడీ మద్దిలేటి, ఉరవకొండకు బీసీ వెల్ఫేర్ అధికారి ఖుష్బూ కొఠారి, యల్లనూరుకు జిల్లా ఉద్యానాధికారి పి.రఘునాథరెడ్డి, పెద్దపప్పూరుకు డెయిరీ శాఖ డీడీ ఎం.ప్రభాకరరెడ్డి, రాయదుర్గానికి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్‌ను ఎన్నికల అధికారులుగా నియమించారు.

బ్యాంకుల బంద్ వాయిదా

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెల 24, 25న తలపెట్టిన బ్యాంకుల బంద్ వాయిదా పడింది. ఈ మేరకు బ్యాంకు ఉద్యోగుల యూనియన్ నాయకులు శుక్రవారం ‘సాక్షి’కి తెలిపారు. జాతీయ కమిటీ, కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన వ్యక్తమైన నేపథ్యంలో సమ్మెను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు జాతీయ కమిటీ నుంచి సమాచారం అందిందన్నారు.

వ్యభిచారం కేసులో కానిస్టేబుల్ అరెస్ట్


కానిస్టేబుల్ పురుషోత్తం

హిందూపురం అర్బన్: అడ్డదారులు తొక్కి సులువుగా డబ్బు సంపాదించాలన్న ఓ కానిస్టేబుల్ ఏకంగా వ్యభిచారం నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యాడు. ఈ ఘటన హిందూపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కానిస్టేబుల్ పురుషోత్తం హిందూపురం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవలే మడకశిర స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. హిందూపురంలోని మోడల్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. పట్టణంలోని బోయ పేటకు చెందిన ఓ మహిళతో కలిసి ఆ ఇంట్లో వ్యభిచార కేంద్రాన్ని ప్రారంభించాడు. ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకు వచ్చేవారు. కానిస్టేబుల్ వ్యవహారశైలిని గమనించిన చుట్టుపక్కల ఇళ్ల వారు పలుమార్లు హెచ్చరించారు. అయినా పద్ధతి మార్చుకోకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండో పట్టణ సీఐ అబ్దుల్ కరీం, సిబ్బంది ఈ నెల 18న రాత్రి ఆ ఇంటిపై దాడి చేసి కానిస్టేబుల్‌తో పాటు సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వ్యభిచారం నిర్వహిస్తున్న విషయం వెలుగు చూడటంతో శుక్రవారం ఇద్దరిపై కేసు నమోదు చేసి..రిమాండుకు తరలించారు. ఇదే కేసులో మేళాపురానికి చెందిన ఈశ్వర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. కాగా.. కానిస్టేబుల్ పురుషోత్తం గుడిబండ స్టేషన్‌లో పనిచేసిన సమయంలోనూ పలు ఆరోపణలతో సస్పెండ్ అయ్యాడు.

మరో ఇద్దరు అరెస్టు

• హిందూపురం పట్టణంలోని సీపీఐ కాలనీలో ఎస్.బాబా, అతని భార్య వ్యభిచారం నిర్వహిస్తుండగా శుక్రవారం ఉదయం దాడి చేసి వారితో పాటు మరొక మహిళను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎండ తీవ్రతకు గురి కావొద్దు

• కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన



అనంతపురం అర్బన్: వేసవిలో ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. ముఖ్యంగా వడదెబ్బకు గురైతే తలనొప్పి, తల తిరగడం, తీవ్ర జ్వరం, మత్తునిద్ర, కలవరింతలు, ఫిట్స్, పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వడదెబ్బకు గురికాకుండా జిల్లా వైద్యారోగ్య శాఖ సూచనలు పాటించాలన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని కోరారు.

వడదెబ్బకు గురవుతే...

- వడదెబ్బకు గురైన వారిని నీడగా ఉన్న చల్లటి ప్రదేశానికి చేర్చాలి. తడివస్త్రంతో శరీరం తుడవాలి. ఫ్యాన్ కింద ఉంచాలి.
- శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల కంటే తక్కువకు వచ్చే వరకూ ఐస్ వాటర్ వస్త్రంతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలి.
- సాధారణ స్థితికి రాకపోతే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. వైద్య చికిత్స అందించాలి.

తీవ్రమైన ఎండలో చేయకూడనివి...

- సూర్య కిరణాలకు, వేడి గాలికి గురికాకూడదు. గొడుగు లేకుండా తిరగరాదు.
- మధ్యాహ్నం తరువాత (ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు) ఆరుబయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పని చేయకూడదు.
- ఎండలో బయటి నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, తేనె తీసుకోకూడదు.
- శీతల పానీయాలు, ఐసు ముక్కలు తీసుకోవడం ద్వారా గొంతు సంబంధిత అనారోగ్యం ఏర్పడుతుంది.

తీవ్ర ఎండలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తెలుపు రంగులోని పలుచటి కాటన్ వస్త్రాలను ధరించాలి. తలకు టోపీ లేదా రుమాలు కట్టుకోవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోస్ కలిపిన నీటిని తాగాలి. ఓరల్ రీ హైడ్రేషన్ నీటినీ తాగొచ్చు.
- ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు గ్లాసు నీరు తప్పనిసరిగా తాగాలి. అలాగే వీలైనన్ని సార్లు నీరు తాగుతూ ఉండాలి.
- ఎండలోంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం కానీ కొబ్బరినీరు లేదా చల్లని (మట్టికుండాలోని) నీరు తాగాలి.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, తదితర అనారోగ్య సమస్యలు ఏర్పడితే దగ్గరలోని డాక్టర్‌ను సంప్రదించి ప్రాథమిక చికిత్స పొంది వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవచ్చు.

పోలీస్ శాఖలో పలువురికి ఉగాది సేవా పతకాలు


లోక్‌నాథ్ చౌదరి, ఎస్‌ఐ

అనంతపురం: పోలీస్ శాఖలోని పలువురికి ఉగాది ఉత్తమ సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో జిల్లా స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐ జి.లోక్‌నాథ్ చౌదరి ఉగాది ఉత్తమ సేవా పతకం దక్కింది. 1990లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరిన ఆయనకు 2011లో హెడ్‌కానిస్టేబుల్‌గా, 2024లో ఎస్ఐగా పదోన్నతి దక్కింది. 2015లో సేవా పురస్కారం పొందారు. 2017లో ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నారు. తాజాగా ఉగాది ఉత్తమ సేవా పురస్కారానికి ప్రభుత్వం ఆయనను ఎంపిక చేసింది. అలాగే 14వ బెటాలియన్‌కు చెందిన ఏఆర్ ఎస్ఐ వీసీఎస్ మహారాజు హెడ్ కానిస్టేబుల్ వి.నారాయణ స్వామికు ఉత్తమ సేవా పతకం దక్కింది. స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఉన్న జె.ధరణికిషోర్, ఇటుకలపల్లి సీఐ జె.హేమంత్‌కుమార్, ఏఆర్ ఎస్ఐ సీహెచ్ నాగేశ్వర రావు, పుట్లూరు, ఏఎస్ఐ పి.రాజశేఖర్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎ.నాగరాజు, కళ్యాణదుర్గం పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎం. హరినాథ బాబు, అనంతపురం రూరల్ పీఎస్ కానిస్టేబుల్ ఎస్.టిప్పుసుల్తాన్, ఉరవకొండ పీఎస్ కానిస్టేబుల్ ఎం.చంద్రశేఖర్, ఏపీ ఆర్‌సీ సి.రాముడు, స్పెషల్‌బ్రాంచ్ కానిస్టేబుల్ ఎ.ప్రసన్న కుమార్‌కు సేవా పతకాలు దక్కాయి.

నెలాఖరు కల్లా హెచ్చెల్సీ పనుల ప్రారంభం

• హెచ్చెల్సీ ఈఈ వెంకటరమణరెడ్డి


155 కిలోమీటర్ వద్ద బ్రిడ్జిని పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఈఈ, డీఈఈలు

కణేకల్లు/బొమ్మనహాళ్: హెచ్చెల్సీ సిస్టమ్‌లో అత్యవసర పనులను ఈ నెలాఖరు కల్లా ప్రారంభించనున్నట్లు హెచ్చెల్సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణరెడ్డి తెలిపారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల పరిధిలోని హెచ్చెల్సీపై కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ మద్దిలేటితో కలసి శుక్రవారం ఆయన పర్యటించారు. 155 కి.మీ., 165 కి.మీ., 169 కి.మీ. వద్ద అర్థాంతరంగా ఆగిన బ్రిడ్జి పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.33.89 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయన్నారు. 155, 165, 169 కి.మీ. వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అలాగే కణేకల్లు చెరువు పరిధిలో 3 స్లూయిస్‌లను రూ.22 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 147 కిలోమీటర్ వద్ద అవుట్ ఫాల్ రెగ్యులేటర్ నిర్మాణానికి రూ. 4.20 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు. పీఏబీఆర్ రెగ్యులేటర్‌ను రూ.4.06 కోట్లు, ఎంపీఆర్ రెగ్యులేటర్‌ను రూ.4.07 కోట్లతో నిర్మిస్తున్నట్లు వివరించారు. మొత్తం రూ.33.89 కోట్ల పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ నిర్వహించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లను పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఈలు అల్తాఫ్, నరేంద్రమారుతీ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తాడిపత్రి రూరల్: రైలులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తూ జారి కిందపడి మృతి చెందాడు. వివరాలను జీఆర్పీ ఎస్ఐ నాగప్ప వెల్లడించారు. తాడిపత్రి మండలం కోమలి గ్రామ సమీపంలోని రైల్వేగేట్ వద్ద శుక్రవారం ఉదయం ఓ యువకుడిని గుర్తించిన స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 35 సంవత్సరాల వయసు ఉంటుందని అంచనా వేశారు. చేతిపై టైటాన్ జాక్‌రోజ్ అనే టాటు, యువతి బొమ్మ ఉన్నాయి. శరీరంపై ఉన్న గాయాలను బట్టి రైలు నుంచి జారి కిందపడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైతు రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి : జేడీఏ


శింగనమల: రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం శింగనమల మండలంలోని శింగనమల, వెస్ట్ నరసాపురం, ఆకులేడు, రైతు సేవా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. జాయింట్ ఎల్‌పీ గ్రామాలు మినహా మిగిలిన అన్ని గ్రామాల్లోని భూములకు రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలు నెలకొంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఏఓ అన్వేష్‌కుమార్, ఏఈఓ అక్కమ్మ , రైతు సేవా కేంద్రం ఉన్నారు.

మందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


అనంతపురంలోని నితిన్ కాంప్లెక్స్‌లో మందుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం: ‘ఆపరేషన్ గరుడ’లో భాగంగా విజిలెన్స్ అధికారులు, ‘ఈగల్’ అధికారులు తదితరులు సంయుక్తంగా శుక్రవారం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఏడు మెడికల్ షాపులపై దాడులు చేశారు. హిందూపురంలో ఒక మెడికల్ షాపులో కాలం చెల్లిన ఔషధాలను గుర్తించారు. నాలుగు షాపుల్లో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే (ఎన్ఆర్ఎక్స్) మందుల కొనుగోలు, అమ్మకాలలో వ్యత్యాసాలు గుర్తించినట్లు అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి వైబీపీటీఏ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ ఎం.నాగభూషణం, సీఐలు జమాల్‌బాషా, సద్గురుడు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్‌కుమార్, ఔషధ నియంత్రణ అధికారి రమేష్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అగ్రోస్ జిల్లా మేనేజర్‌గా ఓబుళపతి



అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఏపీ ఆగ్రికల్చర్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్- ఏపీ అగ్రోస్) జిల్లా మేనేజర్‌గా సి.ఓబుళపతి నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక అగ్రోస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి వద్ద ఉన్న భూసార సంరక్షణ విభాగం (సాయిల్ కన్సర్వేషన్) ఏడీగా ఆయన పనిచేశారు. గతంలో అగ్రోస్ జిల్లా మేనేజర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నందున తిరిగి ఆయనకే బాధ్యతలు అప్పగించినట్లుగా తెలుస్తోంది. ఇటీవల వ్యవసాయశాఖ ద్వారా యాంత్రీకరణ పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకురావడమే కాక, నోడల్ ఏజెన్సీగా అగ్రోస్‌ను గుర్తించడంతో ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టును ఓబుళపతితో భర్తీ చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయశాఖను సమన్వయం చేసుకుని రూ.2.87 కోట్ల బడ్జెట్‌తో రైతులకు వివిధ రకాల స్ప్రేయర్లు, రోటావీటర్లు, పవర్ టిల్లర్లు, పవర్‌వీడర్లు, బ్రష్ కట్టర్స్ తదితర 1,661 యంత్ర పరికరాలు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

డి.హీరేహాళ్ (రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలంలోని లింగమనహళ్లి గ్రామానికి చెందిన బసవరాజు (24) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న బసవరాజుకు తల్లి భాగ్యమ్మతో పాటు ఓ సోదరుడు, సోదరి ఉన్నారు. అవసరాల నిమిత్తం రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చేందుకు భూమి విక్రయిద్దామనుకుంటే అది కాస్త కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి జీవితంపై విరక్తితో శుక్రవారం పొలం వద్ద క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలోనే మృతి చెందాడు. మృతుడి తల్లి కురుబ భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

విజ్ఞాన యాత్రలో రాప్తాడు విద్యార్థులు



సైన్స్ టీచర్‌తో రాప్తాడు పాఠశాల విద్యార్థులు

రాప్తాడు: సైన్స్‌లో అంత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారులు శుక్రవారం విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గైడ్, సైన్స్ టీచర్ అంజనాదేవితో కలిసి విద్యార్థులు జోషియా, కావ్యశ్రీ, నవ్యశ్రీ, జయవర్షిని తరలి వెళ్లారు. విజ్ఞాన యాత్రలో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని మోక్షంగుండా విశ్వేశ్వరయ్య మ్యూజియం సందర్శించారు. హెచ్ఎం సాంబశివుడు, ఉపాధ్యాయులు నరసింహులు, రోజా రమణి, రమేష్ బాబు, కేశవయ్య, గోపాల్ రెడ్డి, సుధారాణి, ఉపాధ్యాయ బృందం తోటి విద్యార్థులను అభినందించారు.

బిల్లులు చెల్లించకపోతే ఎలా?



పంపనూరులో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు పది వారాలకు సంబంధించిన బిల్లులు అందలేదు. పండుగ సమయాల్లో పది వారాల బిల్లులు పెండిగ్ పెడితే ఎలా? అని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మండలంలోని వడ్డుపల్లి, పంపనూరు సచివాలయాల్లో ఉద్యోగులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే అందజేయాలన్నారు. అంతేకాకుండా పనిముట్లు, అలవెన్స్, రోజు వేతనం రూ.600, కొత్తవారికి జాబ్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, రామయ్య, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వలంటీర్ మృతి



బుడగల ఉమాదేవి (ఫైల్)

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన మాజీ వలంటీర్ బుడగల ఉమాదేవి (38) అనారోగ్యంతో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. వివరాలు.. బుడగల ఉమాదేవిని కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన బుడగల శ్రీనివాసులు (ఓ పత్రికా విలేకరి)కి ఇచ్చి వివాహం చేశారు. వివాహం అయినప్పటి నుంచి బుడగల శ్రీనివాసులు రాప్తాడులోనే కాపురం ఉంటున్నారు. ఉమాదేవి టైలరింగ్ ద్వారా కుటుంబాన్ని పోషిస్తూ ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు వలంటీర్‌గా విశేష సేవలు అందించింది. మండల స్థాయి అధికారులు ఆమె సేవలను మెచ్చి ఉత్తమ వలంటీర్‌గా అవార్డులు సైతం ఇచ్చారు.

ఆర్టీఏలో వాహనాలకు 25న వేలం

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రంలోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఈనెల 25న రవాణాశాఖ అధికారులు సీజ్ చేసిన 76 వాహనాలకు వేలం వేయనున్నట్లు డీటీసీ వీర్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుత్తి ఆర్టీసీ డిపోలో 19 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక టిప్పర్, అనంతపురం డీటీసీ కార్యాలయంలో 34 ద్విచక్ర వాహనాలు, కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో 7 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, రాయదుర్గం ఆర్టీసీ డిపోలో 1 ద్విచక్ర వాహనం, 6 ఆటోలు సీజ్ చేసి ఉంచినట్లు వివరించారు. ఆసక్తి గల వ్యక్తులు ఆయా రవాణాశాఖ కార్యాలయంలో సంప్రదించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

రాప్తాడు/అనంతపురం: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశులు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం రోడ్డు, రాప్తాడు సమీపంలోని పంగల్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనాదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాదారులు అజాగ్రతతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. సర్వీస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డులోకి వెళ్లేటప్పుడు జంక్షన్లలో ఒక్క క్షణం ఆగి ప్రయాణించాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేని 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నంబర్లు పెట్టు అమర్చుకుని తీసుకెళ్లాలని ఆదేశించారు.

మునిగితే తప్ప స్పందించరా!

గతంలో అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి పండమేరుకు ఆనుకుని వంక పొరంబోకు స్థలాలను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారు. వేలాది రూపాయలు వసూలు చేసి నకిలీ పట్టాలను పేదలకు కట్టబెట్టారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వంక స్థలాల్లో అక్రమంగా ఏర్పాటైన కాలనీలు కొట్టుకుపోయాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం కలగలేదు. వందలాది మంది కట్టుబట్టలతో బతుకు జీవుడా అంటూ రోడ్డున పడ్డారు. అధికారుల అలసత్వంతో పేదలు నష్టపోయారు. ముందే అధికారులు గట్టి చర్యలు తీసుకుని ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు.

- పామురాయి చెరువు పక్కన వెలసిన గుడిసెలు
- అధికార పార్టీకి చెందిన ఓ చోటా నేత సహకారంతో రెండు ఎకరాల్లో ఏర్పాటు
- చెరువులోకి నీరు వస్తే ప్రమాదం జరిగే అవకాశం
- తెలిసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు



సోమలదొడ్డి-పాముదాయి మధ్యలో ఉన్న చెరువు



సోమలదొడ్డి వద్ద పాముదాయి చెరువు కింద వేసుకున్న గుడిసెలు

రాప్తాడురూరల్: అధికార పార్టీకి చెందిన ఓ చోటానేత సహకారంతో అనంతపురం రూరల్ మండలం పాముదాయి చెరువు (హైదరాబాద్ జాతీయ రహదారి) పక్కన పెద్ద ఎత్తున గుడిసెలు ఏర్పాటయ్యాయి. ఇది మైనర్ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన స్థలం. నాలుగు నెలల క్రితం సర్వే నంబర్ 124లో దాదాపు రెండు ఎకరాల్లో ఈ గుడిసెలు వెలిశాయి. ఇటీవల ఆర్డీఓ, తహసీల్దార్ గుడిసెలను పరిశీలించి వచ్చారు. తర్వాత ఏమి జరిగిందో ఏమో కానీ సైలెంట్ అయిపోయారు. చెరువులోకి వచ్చిన కొద్దిపాటి నీటికే గుడిసెలు వేసుకున్న ప్రాంతమంతా నెమ్ము దిగింది. చెరువులోకి పూర్తిస్థాయి నీరు వచ్చినా, భారీ వర్షాలు వచ్చినా ఈ గుడిసెలు పూర్తిగా మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. కాగా.. స్థానికంగా ఉన్న టీడీపీకి చెందిన ఓ చోటా నాయకుడి హస్తం ఉన్నట్లు తెలిసింది. ఇటీవల కురుగుంట ప్రాంతంలో తడకలేరు వంక కబ్జాను అడ్డుకున్న అధికారులు.. పాముదాయి చెరువు పక్కన వెలిసిన గుడిసెలపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.

ఇరిగేషన్ అధికారుల వైఫల్యం

నాలుగు నెలలు క్రితం గుడిసెలు వెలసినా సంబంధిత మైనర్ ఇరిగేషన్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటిదాకా వారు గుర్తించలేదంటే ఆశాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వంకలు, చెరువుల స్థలాలను మైనర్ ఇరిగేషన్ శాఖ పర్యవేక్షించాల్సి ఉంది. ప్రధాన రహదారి పక్కనే చెరువు స్థలాన్ని ఆక్రమించి గుడిసెలు వేసుకుంటే కనీస చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించాలి. భవిష్యత్తులో చెరువుకు ఆనుకున్న గుడిసెలు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి.

మా దృష్టికి రాలేదు

పాముదాయి చెరువు స్థలంలో గుడిసెలు వేసుకున్న అంశం మా దృష్టికి రాలేదు. మాకు ఆశించిన స్థాయిలో సిబ్బంది లేరు. ఇబ్బందిగా ఉంది. ఏది ఏమైనా ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాం. చెరువు పొరంబోకు స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే ఎవరినీ ఉపేక్షించం. ఆక్రమణదారులపై కేసులు పెడతాం. ఆ గుడిసెలన్నీ తొలగిస్తాం.

– రాము, ఈఈ, మైనర్ ఇరిగేషన్

ఖాళీ చేయమని చెప్పాం

పాముదాయి చెరువు పక్కన కొందరు గుడిసెలు వేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఇటీవల ఆర్డీఓ, తాను వెళ్లి పరిశీలించాం. వర్షం వస్తే చాలా ప్రమాదరకంగా ఉంటుంది. ఖాళీ చేయమని చెప్పాం. అది మైనర్ ఇరిగేషన్‌కు చెందిన స్థలం. సెక్షన్ 25 మైనర్ ఇరిగేషన్ యాక్ట్ ప్రకారం వారు నోటీసులు ఇవ్వాల్సి ఉంది. వారు పోలీసులకు ఫిర్యాదు చేస్తే తొలిగింపునకు సహకరిస్తాం.

– మోహన్ కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం

ఆదర్శప్రాయుడు పప్పూరు రామాచార్యులు



పప్పూరు రామాచార్యుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కల్చరల్: రాయలసీమ అభివృద్ధికి పరితపించిన స్వాతంత్ర్య సమరయోధుడు పప్పూరు రామాచార్యులు ఆదర్శప్రాయుడని మేయర్ వసీం అన్నారు. పప్పూరు రామాచార్యుల వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి చిన్నతనంలోనే రాజకీయంగా ఓనమాలు దిద్దించిన పప్పూరు రామాచార్యుల వ్యక్తిత్వం విలక్షణమని వక్తలు కొనియాడారు. శ్రీసాధన పత్రిక సంపాదకుడిగా, ధర్మవరం ఎమ్మెల్యేగా, అనంతపురం పురపాలక సంఘం అధ్యక్షుడిగా, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో పప్పూరు రామాచార్యుల స్మారక కమిటీ ప్రతినిధులు ఆచార్య బాలసుబ్రమణ్యం, నాగలింగయ్య, డాక్టర్ నాసీల నాగేంద్ర, మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంటు) జ్వాలాపురం శ్రీకాంత్, పప్పూరు రామాచార్యులు మనవడు విజయ్‌కుమార్, ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, సీనియర్ కవులు రియాజుద్దీన్, పూజారి ఈరన్న తెలుగు వెలుగు టీవీరెడ్డి, అంకె రామలింగమయ్య, విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న, సూర్యనారాయణరెడ్డి, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



మాట్లాడుతున్న సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రు పాలు తాపించాలని సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని జిల్లా నీటి యాజమాన్య కార్యాలయంలో అనంతపురం డివిజన్ పరిధిలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా అన్ని పోషకాలు, విటమిన్స్, మినరల్స్, ప్రొటీన్స్ లభిస్తాయన్నారు. ముఖ్యంగా శిశువుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలు రావడం లేదని అనుకోవడం అపోహ మాత్రమేనన్నారు. తల్లి పాలలో సహజసిద్ధమైన ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయని తెలిపారు. తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారన్నారు. గర్భిణులు తాజా కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, చేపలు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవాన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, ఝాన్సీ రాణి, లీలావతి, శ్రీవాణి, లావణ్య, జయశ్రీ, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుకు మైనార్టీలంటే చిన్నచూపు'



మాట్లాడుతున్న మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: హజ్‌యాత్రకు వెళ్లే వారికి విజయవాడ నుంచి ఎంబార్కేషన్ పాయింట్‌ను కూటమి ప్రభుత్వం తొలగించడం బాధాకరం. చంద్రబాబుకు మైనార్టీలంటే చిన్నచూపు అని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ హెచ్చరించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో విజయవాడ నుంచి ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో మన రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లాలంటే హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వెళ్లే పరిస్థితి ఉండేదన్నారు. 2020లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విజయవాడ నుంచి ఎంబార్కేషన్ పాయింట్ ప్రకటించడం జరిగిందన్నారు. 2020, 2021 రెండేళ్లు కోవిడ్ నేపథ్యంలో హజ్‌యాత్ర జరగలేదన్నారు. 2023లో మన రాష్ట్రం నుంచి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,813 మంది హజ్‌యాత్రకు వెళ్లారని తెలిపారు. ఒక్కో హాజీకి రూ.84,000 అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రంజాన్ మాసం మొదలై 20 ఒక్క పొద్దులు అయిపోయినా.. రంజాన్ తోఫా ఇవ్వలేదన్నారు. ఇమాం మౌజన్లకు ఇవ్వాల్సిన జీతాలు 10 నెలలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రహంతుల్లా, కార్పొరేటర్ ఇసాక్, నాయకులు అసిఫ్, ఏ1రఫి, రియాజ్, ఇమ్రాన్, దాదాపీర్ పాల్గొన్నారు.

కవిత్వం ప్రజాపక్షం వహిస్తేనే సార్థకత



మాట్లాడుతున్న డాక్టర్ రాధేయ

అనంతపురం కల్చరల్: కవిత్వం ప్రజాపక్షం వహిస్తేనే దానికి సార్థకత ఉంటుందని డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, ఉమ్మడిశెట్టి అవార్డు నిర్వాహకుడు డాక్టర్ రాధేయ అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కవి సమ్మేళనం సాహిత్య వేదిక, సరోజా గోవిందం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు సామాజిక సమస్యలపై చక్కని కవితలతో ఆకట్టుకున్నారు. గోసల నారాయణ స్వామి, ఎల్లార్‌వీ రమణ, మధురశ్రీ, ఉమాదేవి, రమాదేవి, విద్యావతి, జయరాం, రామచంద్ర నాయక్, రామకృష్ణ తదితరులు కవితా గానం చేశారు. అలాగే తెలుగు వెలుగు సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు టీవీరెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, గాయకుడు డాక్టర్ అంకే రామలింగమయ్యను సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సురేష్, డాక్టర్ జెన్నే ఆనంద్‌కుమార్ నబీరసూల్, జిరసం కోశాధికారి వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్యాయత్నం

కనగానపల్లి: కుటుంబ సమస్యలతో మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వేపకుంట గ్రామంలో ఎరుకల దుర్గాప్రసాద్ అనే యువకుడు వ్యవసాయ భూమిలో తనకు వాటా ఇవ్వలేదని తండ్రి వెంకటప్పను బెదిరించేందుకు గురువారం రాత్రి పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులను గుర్తించి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇక మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో పద్మావతి అనే వివాహిత తెగిపోయిన తన పుస్తెల తాడు చేయించలేదని భర్త కొండప్పతో గొడవపడింది. మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఇంటి వద్దనే విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు గుర్తించి ఆమెను వెంనటే అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నీ



ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్

అనంతపురం: ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ ఫుట్‌బాల్ స్టేడియం వేదికగా సాగుతున్న ఏపీ సూపర్‌కప్ ఫుట్‌బాల్ టోర్నీ రెండో రోజు హోరాహోరీగా సాగింది. తొలి మ్యాచ్‌లో తుంగభద్ర క్లబ్ జట్టుతో తలపడిన కోరమాండల్ క్లబ్ జట్టు 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. నల్లమల క్లబ్, పెన్నా క్లబ్ మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో ఇరు జట్లూ చెరో గోల్ సాధించడంతో మ్యాచ్ డ్రా అయింది. గోదావరి క్లబ్, వంశధార క్లబ్ మధ్య జరిగిన మూడో మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. మ్యాచ్ ఆరంభం నుంచి గోదావరి క్లబ్ జట్టు క్రీడాకారులు దూకుడును ప్రదర్శిస్తూ వచ్చారు. 7–0 గోల్స్ తేడాతో గోదావరి క్లబ్ జట్టు ఘన విజయాన్ని నమోదు చేసింది. కొల్లేరు క్లబ్, విశాఖ క్లబ్ జట్ల మధ్య జరిగిన నాల్గో మ్యాచ్‌లో కొల్లేరు రెండు గోల్స్ సాధించింది. విశాఖ క్లబ్ జట్టు పేలవమైన ఆటతీరుతో ఒక్క గోల్ కూడా సాధించలేక చతికిలపడింది. ఈ మ్యాచ్‌లో కొల్లేరు క్లబ్ జట్టు విజయం సాధించింది. ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో కొల్లేరు, కోరమాండల్ క్లబ్ జట్లు ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాయి. మ్యాచ్‌లను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఏపీఎఫ్ఏ సీనియర్ క్రీడాకారులు సుధాకర్, సిరాజుద్దీన్, నీలాద్రి, శేషగిరి రావు, అనిల్, సురేష్, పవన్, రాజేష్ పరిశీలించారు. మ్యాచ్ కమిషనర్‌గా రెడ్డప్ప వ్యవహరించారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమలదొడ్డి–నాగిరెడ్డిపల్లె మార్గంలోని రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని సోమలదొడ్డికి చెందిన ఈడిగ శ్రీనివాసులు కుమారుడు అశోక్ కుమార్ (28) దుర్మరణం చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి తెలిపారు. మూడేళ్ల కిందట డిగ్రీ పూర్తి చేసిన అశోక్ కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయినట్లు వివరించారు. ఈ క్రమంలోనే రైల్వే గేటు వద్దకు చేరుకున్న అశోక్‌ను రైలు ఢీకొనడంతో శరీరం రెండు భాగాలై అక్కడికక్కడే మరణించినట్లు వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

రాప్తాడురూరల్: జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తి అయిన ఇళ్లను తక్షణం లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న కాలనీని సీపీఎం నాయకులు పరిశీలించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిలంచాలని కోరారు. అధికారులు చొరవ చూపి ఇళ్లను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. నాగేంద్ర కుమార్, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట నారాయణ, ముత్తుజా, ఇర్ఫాన్, గోపాల్, ప్రకాష్ రెడ్డి, మసూద్, కక్కలపల్లి ఓబులేష్, బుల్లె రాజు, జీవ, వెంకటేష్, శీన,గఫూర్, ఎర్రి స్వామి, లక్ష్మి నారాయణ, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దీర్ఘకాలిక వ్యాధులు (క్యాన్సర్, గుండె, నరాలు, కిడ్నీ, వెన్నెముక), చంటి బిడ్డ తల్లులు, గర్భిణులైన ఉపాధ్యాయులను పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ... తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న వారితో పాటు 58 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకూ మినహాయింపులు ఇవ్వాలన్నారు. తగినంత మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించి, వారికి టీఏ, డీఏ చెల్లించాలని కోరారు. 12 సంవత్సరాలుగా ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులను ఇప్పటి వరకు రెగ్యులరైజేషన్ చేయలేదన్నారు. వీరి ప్రొహిబిషన్ డిక్లరేషన్‌కు సంబంధించి పోలీస్ ఎంక్వయిరీ కూడా పూర్తి అయిందన్నారు. రమణయ్య, సుబ్బరాయుడు, చంద్రమోహన్, నాగేంద్ర, గంగాధర్, వెంకటేశులు, శివానంద, పవన్ కుమార్, రాజేంద్ర పాల్గొన్నారు.

నేడు నానో కారు వేలం

అనంతపురం: ఎక్సైజ్ కేసులో పట్టుబడిన టాటా నానో కారును (ఏపీ10ఏడబ్ల్యూ1622) అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు వేలం వేస్తున్నట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2,500 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలం ముగిసిన తర్వాత వేలం దక్కని వారికి రూ.2,500 డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు.

పరామర్శ

అనంతపురం కార్పొరేషన్: అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లును మేయర్ వసీం శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

29 మంది గైర్హాజరు

రాప్తాడు: మండలంలో నాలుగు సెంటర్లలో శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 29 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. 1,070 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,040 మంది హాజరయ్యారని తెలిపారు. సెంటర్ల వద్ద సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి

అనంతపురం కార్పొరేషన్: వక్ఫ్ సవరణ బిల్లు అమలు జరిగితే మైనార్టీ హక్కులకు రక్షణ ఉండదని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.నియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బిల్లు అమలు అయితే వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలన్నారు.

ముస్లింలకు అన్యాయం

రంజాన్ తోఫా అందించకుండా ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అబుజర్ నదీం శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: నిహార్ స్కిల్స్, కడప ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూజీకేవై కార్యక్రమం ద్వారా 4 నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండి 10వ తరగతి, ఇంటర్‌మీడియట్, ఇంజినీరింగ్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన నిరుద్యోగ యువత అర్హులని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. కడపలోని నిహార్ స్కిల్స్ ఆధ్వర్యంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం తరపున ఉచితంగా సర్టిఫికెట్‌తో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నిరుద్యోగ అభ్యర్థులు ఈనెల 24వ తేదీన ప్రారంభమయ్యే ఉచిత కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నిత్యావసరాల పంపిణీ



రంజాన్ తోఫా అందజేస్తున్న మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: ఉగాది, రంజాన్ పండుగను పురస్కరించుకుని చంద్రయాన్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆజాద్ నగర్‌లోని పేద హిందువులు, ముస్లిం మైనార్టీలకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. చంద్రయాన్ సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవలందించాలన్నారు. కార్యక్రమంలో చంద్రయాన్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆదరణ సంస్థ నిర్వాహకులు లాల్‌బాషా, జమాతే ఇస్లామి, హింద్ నగర జనరల్ సెక్రటరీ హాజీపీరా, విశ్రాంత ఉపాధ్యక్షుడు ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.